పోతాను. ను వ్వాపిల్లను ఎగరేసుకుపో" అని ఉపాయం చెప్పాడు గోపాలరావు.

ఏమని జవాబు చెప్పడానికీ నాకు తోచలేదు.

ఆ పిల్ల పక్కన చోటు, మౌంటురోడ్డులో ఖాళీ అయింది.

"వెళ్ళి ప్రక్కన కూచో, మంచి సమయం" అని నన్ను ముందుకు తోశాడు, గోపాలరావు. విధిలేక వెళ్ళి కూచున్నాను. వాడు కూడా, నా దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. వాడు రావడంతోనే ఆ పిల్ల కొంచెం సిగ్గుపడింది.

ఏం చెయ్యడానికీ తోచక, ఆ పిల్లవైపు తిరిగి "వీడు, నా స్నేహితుడు గోపాలరావు. రాత్రి మన యింట్లోనే భోజనం చేస్తాడు!" అనేశాను.

గోపాలరావు తెల్లబోయి నావైపు చూశాడు. మా ఆవిడ మాత్రం సరే నన్నట్టు తల వూపింది.

---

# 3. నర్సు

గ్రుమని మోటారు ఎలెక్ట్రిక్ హారన్ ధ్వని, కీచుమని బ్రేకువేసిన చప్పుడు, ఒకదాని వెంబడి వొకటి రోడ్డంతా ప్రతిధ్వనించాయి. రోడ్డు మీద నడిచే ప్రతివాళ్లతోటి సమంగా ఆ చప్పుడు నేనూ విన్నాను. హఠాత్తుగా నా శరీరమంతా గాలిలో ఎగిరేటంత తేలిక అయిపోయింది. తరవాత ఏం జరిగిందో నాకు తెలియదు.

కళ్లు తెరిచి చూసేటప్పటికి నేను యింకో ప్రపంచంలో, కళ్ళు మూసుకోకపూర్వం ఉన్న స్థితి మారిపోయి, ఉన్నానని బలహీనంగా వున్న నా మెదడుకు స్పృహ కలగడానికి చాలాసేపు పట్టింది. కాలికి కట్టు, తలకి కట్టు, కడుపులో బలహీనత్వమువల్లనూ, ఆకలి

వల్లనూ కలిగే మంటా, కళ్లు తెరచేవుంచి పరిసరాలను స్పష్టంగా చూడ లేకపోవటమూ అంతా అయోమయమనిపించింది. ఆచోటూ, అక్కడికి నేను వెళ్ళటానికిగల కారణమూ, నా తల మీదా, కాలికీ కట్లూ ఎందు కుండవలసి వచ్చిందో ఊహించుకోగల దార్ఢ్యము కూడా మనసుకు లేకపోయింది. కళ్లు మూసుకున్నాను. ఊహించి పరిస్థితులు అర్థం చేసుకోలేను. ఊహించకుండా ఉండలేను. ఏవో ఆలోచనలు ఒక దానితో ఒకటి సంబంధము లేనివి మనసులో మెల్లిగా దొర్లుతున్నాయి. కళ్లు కొంచెం మసక విడి, తెరపి యివ్వడము ఆరంభించాయి.

నా మంచంలాగే ఓ డజను మంచాలూ, రివ్వున తిరుగుతూ ఎలక్ట్రిక్ పంకాలూ- ఆస్పత్రిలో ఉన్నానా యేమిటి చెప్మా అనుకు న్నాను. అనుకోవడ మేమిటి, నిర్ధారణపరచుకోవడ మేమిటి- రెండూ ఒకేసారి జరిగాయి.

దాహం అమితంగా వేస్తోంది. అడగటానికి తగినంత సత్తువ కూడా లేదు. సన్నని గొంతుకతో, కుడిచెయ్యి పైకెత్తి ఇంగ్లీషులో "మంచినీళ్లు" అన్నాను. నా తలవైపు కిటికీ దగ్గర కూర్చుంది కాబోసు నర్సు, "ష్ ష్, మాట్లాడకూడదు" అంటూ నా యెదుటికి వచ్చింది.

మసకగా వున్న నా చూపులో, ఆమె రూపు అసమాన సుంద రంగా ప్రతిఫలించింది. ఆమె డ్రస్సు, ఆ లోలక్కులు, ఆ నల్లటికళ్లు, ఆమె రూపు చూస్తూ నాకు దాహమేస్తోందన్నమాటే మరచిపోయాను. ఏ ఆలోచనా లేకుండా ఆమెకేసి చూస్తూ, నా బాధ మరచిపోయాను.

చల్లటి తన కుడిచేతిని నా నుదుటిమీద పెట్టి, నా మొహానికి దగ్గరగా తన మొహం పెట్టి "మీరు యెక్కువగా మాట్లాడకూడదు. ఆయాసపడకూడదు. ఏం కావా లిప్పుడు?" అంది.

సన్నని, మృదువైన గొంతుకతో, అంత ఆదరంగా ఆమె పలికిన పలుకులు నా గుండెలోకి చొచ్చుకున్నాయి. కాని, నిజంగా మాట్లాడేంత శక్తి నాలో లేదు. ఆమె మాటలకీ, రూపానికీ పరవశుణ్ణి అయిపోయాను. మంచినీళ్లు తెమ్మంటే వెళ్ళిపోతుందేమో అని భయ మేసింది. అక్కడనుంచి ఆ నర్సు వెళ్ళిపోవడం నాకు యెంతమాత్రం యిష్టం కలుగలేదు. ఆమె కళ్లలోకి చూస్తూ నా నుదుటి మీద వేసిన

ఆమె చెయ్యిని గట్టిగా నొక్కిపట్టుకున్నాను.

రెండు నిమిషాలు అలా వుందేమో తన యెడమచేత్తోటి కుడి చెయ్యి పట్టుకున్న నా చేతిని విడిపించి "డాక్టరు వచ్చేవేళయింది. త్వరగా చెప్పండి, మీకు ఏం కావాలో?" అంది.

ఏం చెయ్యలేకపోయాను. "దాహ మేస్తోంది" అన్నాను. చేత్తోటి మెల్లిగా బుగ్గమీద రాసి, తీక్ష్ణంగా నా కళ్ళలోకి చూసి వెళ్ళింది, మంచినీళ్లు తేవడానికి. ఆ చూపులో వున్న దయ, కరుణ ఆమెలో దేవత్వము వుందా అనిపించాయి.

ఆమె మంచుగడ్డవేసిన నీళ్లు తెచ్చి నా గొంతుకలో పోస్తూ వుంటే, అమృతపుధార ప్రవహించిందా నా గొంతుకలోకి అనిపించింది. నీళ్లు త్రాగిన కొంచెంసేపటికి నాకు నిద్రపట్టింది.

## 2

మళ్ళీ నాకు మెళకువ వచ్చేసరికి, మా తమ్ముడు నా ప్రక్కన కూచుని ఉన్నాడు. వాడి చేతిలో ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి'ఉంది.

"ఎలా వుంది, అన్నయ్యా?" అన్నాడు.

"తల కొంచెం తిరుగుతూన్నట్టుగా వుంది, కాళ్లు చేతులూ ఊరికే పీకుతున్నాయి. ఇదంతా ఏమిటిరా?" అన్నాను.

"కారు క్రింద పడిపోయావు. పోలీసులు నిన్ను యిక్కడ చేర్పించి, నీ జేబులోవున్న ఉత్తరాలనుపట్టి మన గది అడ్రసు కనుక్కొని వచ్చి నాకు చెప్పారు. రెండుసార్లు వచ్చాను ఇక్కడికి. రెండు సార్లూ నువ్వు మంచి నిద్రలో ఉన్నావు. వెళ్ళిపోయాను, స్కూలు టైము అయిపోవడంచేత" అన్నాడు నా తమ్ముడు.

"ఒరే, యీ సంగతి యింటికి రాయకుసుమా, అమ్మా నాన్నా బెంగపెట్టుకొని పరుగెత్తుకు చక్కా వస్తారు. చస్తాం యిద్దరమూనూ, గొడవలో పడి" అన్నాను నేను.

"లేదులే, కాని స్కూలులో మాత్రం ప్రిన్సిపాల్‌తో నేను యీ సంగతి చెప్పేశాను" అన్నాడు మా వాడు.

"ప్రిన్సిపాల్‌తో చెపితే ఫరవాలేదు. కాని స్టూడెంట్సుకి ఎవరికీ

చెప్పకు. ఈ వంకతో తయారవుతారు అంతా యిక్కడికి'' అన్నాను. మా వాడు మాట్లాడలేదు.

"ఆ పుస్తకం యేమిటిరా, మాలపల్లా? ఏదీ" అని వాడి దగ్గర నుంచి పుస్తకం తీసుకొని ఏడెనిమిది పేజీలు తిప్పి, "ఇక్కడ వుండ నిస్తూ, తోచడం లేదు'' అన్నాను. వాడు యేమీ మాట్లాడలేదు.

కాసేపు అలాగే కూచుని "డబ్బు ఏమైనా కావాలా? ఎందుకూ, దగ్గిర ఉంటే పీడించుకు తింటారు వీళ్లంతాను. పళ్లూ అవీ కావాలిస్తే నేనే పట్టుకొచ్చి యిస్తాను.........అయినా.........ఈ 'రుపీ' నీ దగ్గర ఉండనీ, అర్జంటుగా ఏమైనా కావలిస్తే ఉంటుంది" అని రూపాయ చిల్లర తీసి నా పక్కమీద పెట్టాడు.

ఆరు గంట లయింది. చీకటి చాయలు క్రమ్ముతున్నాయి. ఆస్ప త్రిలో దీపాలన్నీ వెలిగాయి ఒక్కసారి. అప్పుడే 'స్విచ్' వేసి హాలు మధ్య ఉన్న బల్ల దగ్గరకు వస్తోంది....ఆ నర్సు. నా మనస్సు ఒక్క సారిగా సంతోషంతో నిండిపోయింది.

మా వాడు లేచి ''నేను వెడతానురా''అన్నాడు.

"ఊఁ, రేపు ప్రొద్దున్నేరా" అంటూ ఏదో చెప్పబోయాను. ఆ నర్సు....మా దగ్గిరకి వచ్చింది, పాలగ్లాసు చేతిలో పట్టుకొని.

"పాలు త్రాగండి" అంటూ నా గొంతులో పోసింది, మెల్లిగా అ పాలన్నీని. చూస్తూ మా వాడు అక్కడే నుంచున్నాడు. నాకు కోపం వచ్చింది, వాడు వెళ్ళిపోనందుకు. పాల గ్లాసు ఖాళీ కాగానే, ఆమె వెళ్ళిపోయింది. "అల్ రైట్, వెడుతున్నాన్రా" అని మా వాడు వెళ్ళిపోయాడు. వాడి మీద నాకు అమిత కోపం వచ్చింది.

ఎనిమిది గంటలయింది. 'వార్డు'లో వున్న రోగులలో చాలా మంది నిద్రలో మునిగి తేలుతున్నారు అప్పుడే. నాకు మాత్రం నిద్ర పట్టలేదు. నా కళ్లు కుర్చీలో కూచుని వ్రాసుకుంటూనూ, పిలిచిన ప్రతి రోగి దగ్గిరికీ కెళ్ళి వస్తూనూ, తన డ్యూటీ తను చేసుకుంటూ ఉన్న ఆ నర్సు మీదనే వున్నాయి. ఈ నానా రోగాలతోటీ అవస్థ పడుతూ, తలుచుకోడానికి కూడా అసహ్యంగా ఉండే యీ దౌర్భాగ్యులందరికీ విసుగూ, చిరాకూ లేకుండా అలా పరిచర్య చేస్తోంది, ఆమె మనసు

నిజంగా ఎంత కోమలమైనదో! ఇలాటి చక్కని స్త్రీ యిందుకోసమా పుట్టుక! పాపం, నాకు చాలా జాలి వేసింది.

ఆమె గడియారంకేసి చూసింది. ఆమెతోపాటు నేనూ చూశాను. పనిమిదింబావు.... చేతులో ఉన్న కలం బల్లమీద పెట్టి, కుర్చీలోనుంచి లేచి, నా వైపు చూసింది. మా యిద్దరి కళ్లూ కలుసుకున్నాయి. మెల్లిగా నా దగ్గరికి వచ్చింది. ఆమె పెదవుల మీద చిరునవ్వు తాండవమాడింది. నాకు సంతోషం ఒళ్ళంతా పొంగించి వేసింది.

"ఇంకా పడుకోలేదూ?" అంది, తన రెండుచేతులూ నడుము మీద పెట్టుకుని.

"ఇంకా నిద్ర రాలేదు. మీకు రాత్రి డ్యూటీయా?" అన్నాను నేను.

"అవును, ఇంకా వారంరోజుల దాకా" అన్నది ఆమె.

"తరవాత?" అన్నాను నేను. నాకు చాలా భయంవేసింది- ఆ వార్డులో డ్యూటీ అయిపోయి, ఆమె ఇంకో వార్డుకి వెళ్ళిపోతుందేమోనని.

"తరువాత పగటి డ్యూటీ...." అంది ఆమె.

"ఈ వార్డులోనేనా?" అన్నాను నేను పట్టలేక.

"బహుశా. చెప్పలేను" అంది ఆమె. నేను ఆలోచనలో పడి పోయాను. అప్పటిదాకా దేవుడు మాట తలవని నేను, యీ వార్డు లోనే ఆమెను ఉండేటట్టు చెయ్యమని శ్రీకృష్ణ భగవానుణ్ణి ప్రార్థించు కున్నాను.

"ఇందాకా వచ్చిన ఆయన ఎవరు?" అని అడిగింది మెల్లిగా. నాకు కొంచెం ఈర్ష్య వచ్చింది. వాడి సంగతి యెందుకూ, ఆమెకి?

"మా తమ్ముడు" అన్నాను.

"ఏం చేస్తున్నారు యిక్కడ?" అని మళ్ళీ అడిగింది.

"చదువుతున్నాడు" అన్నాను.

"ఏమిటి?" మళ్ళీ వాడినిగురించే యింకో ప్రశ్న వేసింది.

"బి. ఏ." అన్నాను.

"మీరు?" అంది, ఆమె.

ఇంత సేపటికా నా మాట!

"ఎమ్మే" అన్నాను, వెంటనే.

"అయిందా, అవాలా?" అంది ఆమె.

"రెండో సంవత్సరం, అవుతోంది" అన్నాను.

"మీ తమ్ముడిపేరు?" అని మళ్ళా వాడి సంగతిలోకి దిగింది.

"మోహనరావు" అన్నాను.

ఈసారి వాడిసంగతి అడిగితే జవాబు చెప్పదలచుకోలేదు నేను.

"అ పుస్తక మేమిటి?" అంది, కొంచెంసేపు ఊరుకొని.

"మాలపల్లి అని, తెలుగు నవల" అన్నాను నేను.

"చదువుకుందుకు యిస్తారా?" అని అడిగింది.

"తెలుగు తెలుసునా మీకు?" అన్నాను.

"మేము తెలుగువాళ్ళమే" అంది.

నా వొళ్లు ఝల్లుమంది. తెలుగువాళ్ళా? మాలపల్లి ఆమెకు యిచ్చాను. తీసుకొని రెండడుగులు వేసింది.

"ఇదిగో, మాట. నీ పేరు?" ఈ సారి తెలుగులో అడిగాను.

"నా పేరా........" అని చిన్ననవ్వు నవ్వి, "పద్మావతి" అంటూ వెళ్ళి కుర్చీలో కూచుని మాలపల్లి చదవడం ఆరంభించింది.

## 3

మ్మరునాటి సాయంత్రము ఆరుగంటలకి మా తమ్ముడు వచ్చాడు. కొంచెం యించుమించుగా అదేవేళ వాడు వచ్చినతరువాత పద్మావతి వచ్చింది. నా తోటి కబుర్లు చెపుతూ మా వాడు నా దగ్గరే చాలాసేపు కూచున్నాడు. నాకు విసుగేసింది. వాడు త్వరగా వెళ్ళిపోతే, పద్మావతిని పిలిచి యేమేనా మాట్లాడుదామని నా మనసు ఊరికే ఉబలాట పడుతోంది. వాడు మాత్రం, ఏదో లోకాభిరామాయణం చెపుతూ, నేను పరధ్యానంగా వున్నట్టు కనపడితే, నా దృష్టి యెటుందో అటే తన కళ్లు కూడా తిప్పేవాడు. వాడు పద్మావతికేసి చూడటముతోటే నా మనసు చివుక్కుమనేది. మా తమ్ముడి మీద, అదివరకు యెప్పుడూ లేని యేహ్యమైన భావం కలిగేది. కాని ఆ భావం వాడికి తెలియచెప్పటానికి ధైర్యంలేదు. వాడు ఆమెవైపు చూడటం యిష్టంలేదు. అక్కడికీ గ్రహిస్తాడేమోనని, ఏదో సందర్భంలో నర్సుమాట యెత్తి, వాళ్ళంతా

చెడిపోయిని బాపతనీ, మొగాళ్ళను యిట్టే వలలో వేసుకొని నాశనం చేసి వొదుల్తారనీ, అంతటి మోసగత్తెలు ప్రపంచంలో ఉండరనీ, పచ్చి బోగందాన్ని అయినా నమ్మవచ్చును కాని, నర్సులను మాత్రం కలలో అయినా నమ్మకూడదనీ, ఒక చిన్న లెక్చరు విసిరాను. దానిమీద మా వాడు అందుకొని, ఎక్కడో ఒకరిద్దరు తప్ప తక్కిన వాళ్ళంతా చాలా మంచిగుణాలు గలవాళ్ళనీ, అంత సౌమ్యమైన, మృదువైన, ప్రేమ పూరితమైన హృదయం గలవాళ్ళు యిల్లాండ్రలో కూడా వుండరనీ, నిజంగా సంసారంలో మహానందం అనుభవించాలంటే, మనస్ఫూర్తిగా మనల్ని ప్రేమించిన నర్సునే పెళ్ళిచేసుకోవాలనీ, ఇల్లు స్వర్గతుల్యంగా పరిశుభ్రంగా వుండాలంటే నర్సుకే యింటిపెత్తనం యివ్వాలనీ, పెద్ద విసురు విసిరాడు. ఇరవై అడుగుల దూరంలో ఎదురుగుండా కూర్చునీ ఉన్న పద్మావతి మొహంజూస్తూ, మా వాడి మాట కాదనలేకపోయాను.

నా మొహంకేసి పరీక్షగా చూసి, పద్మావతికేసి చూపిస్తూ "ఇది పెద్ద మనిషిలాగే ఉంది" అన్నాడు. నా శరీరము భగ్గుమని మండింది. మా వాడి దృష్టికూడా ఆమె మీద వుందన్నమాట. 'పశువు! ఆ మాత్రం కనిపెట్ట లేకపోయాడు, నా మనసు' అనుకున్నాను.

"వెడతానురా" అని లేచాడు. మళ్ళీ రమ్మనటానికి నాకు మనస్కరించలేదు. నేను రమ్మనకపోతే మాత్రం రాకుండా వుంటాడా యేమిటి? కడుపులో కుళ్ళంతా అణచిపెట్టుకొని 'ఊ' అన్నాను వెడుతూ వెడుతూ, దగ్గిరికి—నా పద్మావతి దగ్గిరికి—వెళ్ళి బల్లమీద మోచేతులు ఆన్చి యేమిటో మాట్లాడాడు. ఆమె సమాధానం చెప్పింది. చివరికి యిద్దరూ నవ్వుకున్నారు. వాడు వెళ్ళిపోయాడు. నాకు ఆ సమయంలో కలిగిన భావాన్ని వర్ణించటానికి వీలులేదు.

వాడు వెళ్ళిపోగానే, మాలపల్లి తీసుకొని పద్మావతి నా దగ్గిరికి వచ్చింది.

"ఇదుగోనండీ, చదివేశాను. థ్యాంక్స్" అంది.

"అప్పుడే, ఒక్కరోజులోనే—" అన్నాను నేను.

"అవును. రాత్రి కొంత చదివాను. పగలల్లా చదువుతూనే వున్నాను. పగలు నిద్దరకూడా పోలేదు" అంది పద్మావతి.

"ఎలా వుంది?" అని అడిగాను.

"అప్పారావు, జ్యోతుల ప్రేమమాత్రం చాలా అసమానంగా వుంది" అంది పద్మావతి. ఆమెకు ప్రేమకూడా తెలుసు నన్నమాట; ప్రేమ అంటే—ఎలా ప్రేమించాలో?

పద్మావతి వెళ్ళిపోవడానికి వెనకకు తిరిగింది.

"కాస్సేపు కూచోకూడదూ, మాట్లాడుతూనూ?" అన్నాను ఎంతో ధైర్యం తెచ్చిపెట్టుకొని.

"అమ్మయ్యో, నర్సులు పేషెంట్లదగ్గర కూచుని మాట్లాడడమే! డాక్టర్లు చూస్తే, గొంతు కోసెయ్యరూ?" అంది పద్మావతి.

అయితే, నిజంగా కూచుని కబుర్లు చెపుదామనే వుంది కాబోలు ఆమె మనసులో, పాపం!

"ఇప్పుడు ఇలాంటి వేళ యెవరు రాబోయినారులెస్తూ!" అన్నాను కొంచెం చొరవ చేసుకొని.

"వచ్చినా రాకపోయినా, కూచుని యెప్పుడూ పేషెంట్లతోటి మాట్లాడకూడదు" అంది; ఆమె పెదవులు చిరునవ్వు తొలకరించాయి.

"పోనీ, నిలుచునే మాట్లాడు!" అన్నాను, ఆమె అక్కడ నుంచి వెళ్ళిపోవడం యిష్టంలేక.

"ఏం మాట్లాడమంటారు చెప్పండి?" అంది, చిన్ననవ్వు నవ్వి.

ఏం చెప్పను?

కీచుకీచుమనే జోళ్ళ చప్పుడుతో మెడికల్ స్టూడెంటు వొకడు వచ్చి "గుడీవినింగ్ సిస్టర్" అన్నాడు, ఘల్లుమనే కంఠంతో. "గుడ్ యీవెనింగ్" అంది పద్మావతి సన్నని కంఠంతో.

ఏదో అన్నాడు, పకపక నవ్వుతూ అతడు. మొహం చిట్లించుకొని ఆమె యేదో జవాబు చెప్పింది. రెండూ నాకు వినపళ్ళేదు. అతడు మాత్రం తల వ్రేలాడేసుకొని చక్కాపోయాడు.

పద్మావతి నా కేసి తిరిగి "వీళ్ళకి బుద్ధిలేదు" అంది. నన్నుతప్ప యింకెవ్వరినీ ఆమె—అనుకున్నాను.

ప్రక్కనున్న రోగి యెవడో "మంచినీళ్ళు" అని ఆమెను పిలిచాడు. ఆమె వెళ్ళిపోయింది. ఆమెచేత చాకిరీ చేయించుకోవడానికి,

వీళ్ళందరికీగల అధికారమేమిటో నాకు అర్థం కాలేదు. మళ్ళీ ఆ రాత్రి అమె నా దగ్గరకు రాలేదు. నేను పిలవలేదు.

## 4

ఆస్పత్రిలో నేను ఆ తరవాత సుమారు పది రోజు లున్నాను. మొదటి అయిదారురోజులు పద్మావతి నైట్ డ్యూటీలోనే వుంది. ఆ తరువాత ఆమెను ఆ వార్డులోనే పగటి డ్యూటీకి మార్చారు. నేను అమితంగా సంతోషించాను. వీలైనప్పుడల్లా ఆమెతోటి మాటాడేవాణ్ణి. చాలా కులాసాగా, నవ్వుతూ, హృదయపూర్వకంగా మాట్లాడేది. నాకు మరీ సంతోషం కలగడానికి పెద్ద కారణ మేమిటంటే, ఆమె నైట్ డ్యూటీ చేసేరోజులలో పగలూ, పగటిడ్యూటీ చేసేరోజులలో, ప్రొద్దుగూకేవేళా వచ్చేవాడు మా తమ్ముడు. మొదటి రెండుసార్లూ తప్ప వాళ్ళు మళ్ళా వొకర్ని వొకరు చూసుకోలేదు. ఒకరిమాట ఒకరు తలపెట్టలేదు.

పద్మావతి మా తమ్ముడి విషయమై తలపెట్టనేలేదన్నమాట!

ఆస్పత్రిలో నేను ఉన్నన్నాళ్ళూ నాతోటి ఆమె మాట్లాడిన పద్ధతిజూస్తే, నామీద ఆమెకి యెంతో ప్రేమా, గౌరవమూ ఉన్నట్టు కనిపిస్తోంది. నామటుకు నేను ధన్యుణ్ణి అనుకున్నాను. పురుషుడు తను అందకత్తె అనుకొని ప్రేమించిన స్త్రీ తిరిగి తన్ను ప్రేమిస్తోందని గ్రహిస్తే పొందే పరమానందాన్ని నేనూ పొందాను.

ఆస్పత్రినించి నన్ను డిశ్చార్జి చేసినరోజు, నేను పడిన విచారానికి అంతులేదు. పద్మావతికికూడా నేను ఆస్పత్రిలోంచి వెళ్ళిపోవడం యిష్టము లేనట్టుగా, ఆమె మొహంలోని భావాన్ని నేను అర్థం చేసుకున్నాను.

"పద్మావతీ, వెడుతున్నా. నువ్వు చేసిన—" అని ఆరంభించాను నా వీడ్కోలు వినతి.

"అవేమీ చెప్పొద్దండి. నేను ఏంచేసినా, అదంతా నా డ్యూటీ" అంది. పద్మావతి.

ఎంత నిర్మలమైన, నిరాడంబరమైన హృదయము, పద్మావతిది!

"సరే, మా రూముకి యెప్పుడేనా రాకూడదూ?" అన్నాను.

అంత ధైర్యం నాకు ఎలా వచ్చిందో నాకే తెలియదు.

ఆమె నా కళ్ళలోకి చూసింది.

"ఏం....?" అన్నాను మళ్ళీ.

"అలాగే లెండి" అంది.

"అయితే ఎడ్రసు రాసి యివ్వనా?" అని కాగితం, కలంకోసం జేబు తడిమాను.

"అక్కర్లేదు. మీ యెడ్రసు నాకు తెలుసును" అంది.

ఎలా తెలుసును ఈమెకి? అడుగుదామని తటపటాయించాను. హాస్పిటలు షీటులో వ్రాసిన నా యెడ్రసు ఆమె చూసివుంటుందని నాకు జ్ఞాపకము వచ్చింది. నా యెడ్రసుకూడా కనుక్కుందన్నమాట!

అయితే పద్మావతి నిజంగా నన్ను—ప్రతి అడుగుకీ వెనక్కిలాగే కాళ్ళను బలవంతాన ముందుకి లాగుతూ ఆస్పత్రిలోనుంచి బయట పడ్డాను.

గదికి నేను వచ్చేటప్పటికి మా తమ్ముడు, స్కూలుకు వెళ్ళడానికి డ్రస్సువేసుకుంటూ వున్నాడు.

"డిశ్చార్జ్ చేశారా ఏమిటిరా?" అన్నాడు నన్ను చూడగానే.

"అవును, వచ్చేశాను. నిన్న సాయంత్రం నీతో చెప్పాను కదూ?" అన్నాను.

నా మనస్సు యెక్కడో వుంది.

"సరే, ఆఁ....నువ్వు కాలేజీకి వెళ్లవన్నమాట?" అని అందుకున్నాడు మా వాడు.

"ఆఁ....అవును. ఇంకా రెండు మూడు రోజులదాకా వెళ్ళను. నీరసం యింకా తగ్గలేదు" అన్నాను.

మా వాడు వెళ్ళిపోయాడు.

హోటలునుంచి అన్నం తెప్పించుకొని గదిలోనే భోంచేసేశాను.

ప్రొద్దుగూకేవేళ పద్మావతి మా గదికి వస్తుందనుకున్నాను. గుమ్మంకేసి కళ్లుపెట్టుకొని, యెంతసేపు చూశానో! పద్మావతి రాలేదు. కాలం గడిచినకొద్దీ నా తాపత్రయం యెక్కువైంది. ఆమె రాలేదు.

చీకటిపడిపోయింది. గదిలో లైటు వెలుగుతూ వుంది. పది

రోజుల ఈమధ్య నా జీవితంలో కలిగిన మార్పుకి నాకే ఆశ్చర్యము వేసింది. ఆలోచించుకుంటూ కూర్చున్నాను. ఎనిమిదిన్నర అయి పోయింది. ఆమె యింకరాదు.

మా తమ్ముడు మెట్లు చప్పుడు చేసుకుంటూ పైకి వచ్చాడు. క్యారియరుతో అన్నం తీసుకొచ్చే అయ్యర్ మాకు వడ్డించాడు. ఇద్ద రమూ భోజనం చేశాము. సిగరెట్లు వెలిగించాము.

"అన్నయ్యా, నీతోటి ఒక సంగతి చెప్పా లనుకున్నానురా" అన్నాడు మా వాడు.

వాడు ఏం చెప్పదలచుకున్నాడో, ముందు నేను ఊహించలేక పోయాను.

"చెప్పు" అన్నాను.

"నీమీద నాకున్న భక్తి గౌరవాలచేత ఈ విషయం చెపుతున్నాను. నాకు నువ్వు అవసరమైన సహాయం చెయ్యమని ప్రార్థిస్తు న్నాను" అన్నాడు మా వాడు. నాకేమీ బోధపడలేదు.

"చెప్పరా!" అని అడిగాను.

"పద్మావతిని పెళ్ళి చేసుకుందామని వుందిరా" అన్నాడు.

నెత్తిమీద గొడ్డలితో బాదినట్లు దిమ్మరపోయాను నేను. మా వాడు సూదుల్లాటి తన కళ్ళతో నావేపు చూస్తున్నాడు.

"నీమీద ఆమెకు యిష్టముందో లేదో కనుక్కోవద్దూ?" అన్నాను. మాట్లాడడానికి నేను యెంత బాధపడ్డానో నా గొంతుకనుపట్టి మా వాడు కనిపెట్టే వుంటాడు.

"ఆమెకి నామీద ప్రేమ వుంది. ఆమెను నేను ప్రేమించాను. ఆమె నన్ను ప్రేమించింది. ఒకర్ని వొకరం మోసగించుకోవడం యిష్టంలేదు కనక పెళ్ళి చేసుకుందా మనుకున్నాను. మే మిద్దరమూ ప్రతిరోజూ కలుసుకుంటున్నాము" అన్నాడు.

నేను మాట్లాడలేదు.

"పద్మావతిని పెళ్ళిచేసుకోకపోతే, నేను విషంత్రాగి చచ్చిపోతాను కాని బ్రతుకనురా" అన్నాడు.

వాడి మొహంకేసి చూశాను. స్థిర నిశ్చయం వాడి మొహంలో

స్పష్టంగా కనపడుతోంది.

నా స్థితి రొంపిలో దిగపడినట్లయింది.

"పద్మావతి క్రింద వుంది, తీసుకొస్తాను" అంటూ మా వాడు క్రిందికి వెళ్లాడు. నేను ఆలోచనలో పడిపోయాను. ఏంచెయ్యను, ఇప్పుడు? మా వాడూ, పద్మావతీ యిద్దరూ చేతులు కలుపుకొని పైకి వచ్చారు. నన్ను చూసి తలవొంచుకుంది పద్మావతి. సోదరిని ప్రేమించి నట్లు ఆమెను ప్రేమించగలిగితే!

తళుక్కుని మెరుపు మెరిసినట్లు, ఆ భావం నా హృదయంలో కలిగింది. అంతకన్న బ్రహ్మానందం వుండదని తోచింది.

"సరే రా, మోహన్! పద్మావతిని నా సోదరిలా ప్రేమిస్తు న్నాను. ఆమె క్రిస్టియనుకనుక, కేశవదేవ జ్ఞానిచేత ఆర్యసమాజంలో శుద్ధిచేయించి పెళ్ళి చేసుకో. ఏమీ అనకుండా అమ్మా, నాన్నలకి ఉత్తరం రాసే బాధ్యత నాది" అనేశాను. అంతటి బాధ్యత నెత్తిన వేసు కోడానికి, నా హృదయంలో కలిగిన పరివర్తనకి నేనే పొంగిపోయాను.

ప్రియు లిద్దరూ నా కాళ్ళకి నమస్కారం చేశారు; వాళ్ళు ఆ నిమిషంలో పొందిన బ్రహ్మానందమే చాలు, నేను జీవించినన్నాళ్లూ నన్ను సుఖపెట్టడానికి.

---

# 4. తెల్లవారుఝాము పాఠాలు

శోభనమయిన క్రొత్తలో, బి. ఏ. పరీక్ష ప్యాసయిన కబురు తెలిసి, గోపాలరావూ అతని భార్యాయే కాకుండా, రెండువైపుల బంధు వులూ కూడా పొంగిపోయారు. చచ్చి చెడి చదివినవాడు గోపాలరావే అయినా, "ఇంతకీ అన్నపూర్ణ అదృష్టం" అంటూ, అదృష్టం మాత్రం అతని భార్యకి అంటగట్టారు బంధువులందరూను. శోభనపు శృంగా